శిశువులను ఎదపై పెట్టుకున్న తల్లులు, సంరక్షకులు

శిశు సంరక్షణకు 'కంగారు' విధానం

- ఎంసీహెచ్ పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ కల్యాణి
- ఘనంగా 'కంగారు'మదర్స్ డే

విద్యానగర్, మే 15 : నెలలు నిండకుండానే బరువు తక్కువగా పుట్టిన శిశువులను సంరక్షించుకునేందుకు కంగారు విధానం ఎంతగానో దోహదపడుతుందని మాతా శిశు ఆరోగ్యకేంద్రం పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ కల్యాణి తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని జనరల్ హాస్పిటల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కంగారు మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కంగారు జంతువుకు ఉదర భాగంలో ప్రత్యేక సంచి ఉంటుందని, పిల్లలు వృద్ధి చెందేంత వరకు అందులోనే ఉంచుకుని సంరక్షించుకుంటుందని పేర్కొన్నారు. మాతా శిశు కేంద్రంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నెలలు నిండక ముందే జన్మించిన శిశువులో తక్కువ బరువుతో పాటు ఇతర సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. శరీరంలోని ఇతర అవయవాల్లో ఎదుగుదల లోపిస్తుందని, జ్ఞాపక శక్తి తక్కువగా ఉంటుందని చెప్పారు. తల్లి గర్భంలో ఉన్నట్లుగానే తల్లి ఎదపై బిడ్డను పడుకోబెట్టుకుంటే శిశువుకు గర్భంలో లభించే ఉష్ణోగ్రత అంది క్రమక్రమంగా వృద్ధి చెందుతుందన్నారు. దీంతో పాటు తల్లి శిశువు మధ్య అనుబంధం మరింత బలపడుతుందన్నారు. తక్కువ బరువుతో జన్మించిన శిశువు చర్మం పలుచగా ఉండడంతో త్వరగా చల్లబడుతుందని, ఇది చాలా ప్రమాదకరమని తెలిపారు. తల్లి శరీరంలోని ఉష్ణోగ్రత అందడంతో శ్వాస, రక్త ప్రసరణ పెరిగి శిశువులోని అనేక అనారోగ్య సమస్యలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. కంగారు విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు వేణు, మల్లికార్జున్, పవిత్ర, సతీశ్, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ పమేలా సత్పతి
- డీలర్లకు అవగాహన సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్, మే 15 : రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగు మందులు, నిషేధిత బీటీ-3 (హెచ్‌టీకాటన్) పత్తి విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. బుధవారం కరీంనగర్‌లోని గాంధీ రోడ్‌లో గల తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో జిల్లాలోని అన్ని వ్యవసాయ డీలర్ల(విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు)కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ, డీలర్లు రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ పీఓఎస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేయాలన్నారు. గ్రౌండ్ స్టాక్ ఎరువుల నిల్వలు, పీఓఎస్ మిషన్‌లోని నిల్వలతో తప్పక సరిపోలాలని సూచించారు. మండల వ్యవసాయాధికారులు పక్షం, నెల రోజులకొకసారి ఎరువుల విక్రయ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆడిట్ చేయాలని ఆదేశించారు. రాబోయే సీజన్‌లో డీలర్లం దరూ కల్తీ లేని ఆరోగ్యకరమైన వ్యాపారం చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే నాన్ బెయిలబుల్ కేసులతో పాటు పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సదస్సులో డీలర్లతో పాటు మండల వ్యవసాయాధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, మార్క్‌ఫెడ్ మేనేజర్, సహకార అధికారులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సుకు హాజరైన మండల వ్యవసాయాధికారులు, డీలర్లు

శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే గంగుల

శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, మే 15: శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారిని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి వెళ్లిన ఆయనకు ఆలయ ప్రధాన గోపురం వద్ద ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలతో పాటు కరీంనగర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీశైల మల్లికార్జున స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బత్తుల భూమయ్య సేవలు చిరస్మరణీయం

సంతాపసభలో భూమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు

చొప్పదండి, మే 15: మండల విద్యాధికారిగా బత్తుల భూమయ్య విద్యారంగంలో చేసిన సేవలు సమాజంలో చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం కొనియాడారు. ఎండపల్లి, ధర్మపురి బుగ్గారం, వెల్గటూర్ మండలాల విద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న చొప్పదండికి చెందిన భూమయ్య ఇటీవల హఠాన్మరణం చెందగా, బుధవారం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయ, ఉద్యోగ, దళిత తదితర సంఘాల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేతో పాటు వక్తలు మాట్లాడుతూ, భూమయ్య ఉద్యోగిగానే కాకుండా సామాజిక సేవకుడిగా అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చొరవ, క్రమశిక్షణ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, హైకోర్టు రిటైర్డ్ జడ్జి, మానవ హక్కుల సంఘం మాజీ చైర్మన్ గుండా చంద్రయ్య, ఎంపీపీ చిలుక రవీందర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కౌన్సిలర్ ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ అసోసియేషన్ రాష్ట్ర కో కన్వీనర్ కట్టెకోళ్ల శ్రీనివాసరావు, కొత్తూరు మహేశ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య, మాల సంఘం జిల్లా అధ్యక్షుడు కాడ శంకర్, రాష్ట్ర నాయకులు మేడి అంజయ్య, సదానందం, తాళ్ల వెంకన్న, అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంఘాల నేతలు, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, ఎండపల్లి, ధర్మపురి, బుగ్గారం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మాజీ సర్పంచ్ విష్ణు కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెండో విడుత గొర్రెల పంపిణీ చేపట్టాలి

చిగురుమామిడి, మే 15: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రెండో విడుత కార్యక్రమాన్ని త్వరగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు, యాదవ సంఘం జిల్లా నాయకుడు కత్తుల రమేశ్ యాదవ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రెండో విడుత పంపిణీకిగానూ డీడీలు చెల్లించిన వారందరికీ డబ్బులు వాపస్ ఇచ్చే ధోరణిని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించడం సరికాదని పేర్కొన్నారు. గొర్రెల పంపిణీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, యాదవులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తే యాదవుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 15: ఏబీ స్విచ్ పనులతో పాటు విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు తిరుమల్ నగర్, కట్టరాంపూర్, కోతి రాంపూర్, భవానీ నగర్, శ్రీనివాస్ నగర్, దుర్గాదేవి నగర్, మహాలక్ష్మి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 టు ఏడీఈ సుధీర్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

బొమ్మనపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీవో

చిగురుమామిడి, మే 14 : మండలంలోని ముల్కనూరు, ఓబులాపూర్, గాగిరెడ్డిపల్లి, బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మాలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం అడిషనల్ డీఆర్డీవో పీ సునీత పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో మధుసూదన్, ఏఈ కృష్ణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

బీమా నగదు అందజేత

తిమ్మాపూర్ రూరల్, మే15: మండలంలోని పోరండ్ల గ్రామంలో శ్రీ ఆదర్శ పురుషుల పొదుపు సంఘ సభ్యుడు సదిరే నర్సయ్య ఇటీవల మరణించగా, సంఘం నుంచి మంజూరైన బీమా నగదు, పొదుపు, బోనస్ రూ.లక్షా 3వేల నగదును బుధవారం అతడి కుటుంబసభ్యులకు సమితి అధ్యక్షుడు గుంటి వెంకటేశ్, సంఘం అధ్యక్షుడు నాగపురి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

శంకరపట్నం, మే 15: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఇటీవల పంజాల సంపత్, పంజాల మోహన్ మాతృమూర్తి మృతి చెందగా, బుధవారం బాధిత కుటుంబానికి కేశవపట్నం గ్రామానికి చెందిన నాయకుడు పూరెళ్ల ప్రశాంత్ 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బండారి తిరుపతి, నాయకులు రాజయ్య, షారూఖ్, శ్రీకాంత్ ఉన్నారు.

20 నుంచి క్రీడాపోటీలు

ఇల్లంతకుంట, మే 15: మండల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20నుంచి 25 దాకా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ రాజుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో కబడ్డీ, వాలీబాల్ అంశాల్లో పోటీలను ఉంటాయని తెలిపారు. పేర్ల నమోదు కోసం పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌రావు (8712537607), లక్ష్మీనారాయణ (9493005749), శ్రీకాంత్ (9010467848)ను ఈ నెల 18 నుంచి సంప్రదించాలని సూచించారు.

తాడికల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా
- ఒకరు మృతి.. ఏడుగురికి గాయాలు

పూదరి శ్రీనివాస్ (ఫైల్)

శంకరపట్నం, మే 15: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి నిర్మాణ సంస్థకు చెందిన ఓ డీజిల్ ట్యాంకర్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌హెచ్ 563 నిర్మాణ పనుల్లో భాగంగా దిలీప్ బుల్డ్‌కాన్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా వంకాయగూడెం వద్ద ఓ బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్నాడు. అక్కడ ఆగకుండా నిర్లక్ష్యంగా, అతి వేగంగా వెళ్తుండగా తాడికల్ వద్ద ట్యాంకర్ అదుపు తప్పి ఓ గోడకు ఢీకొని బోల్తా పడింది. వ్యక్తిగత పనిపై బస్టాప్ వైపు వస్తున్న పూదరి శ్రీనివాస్ (39)పై ట్యాంకర్ బోల్తా పడగా అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో బస్టాప్ వద్ద బస్సు కోసం నిలబడిన వెంగళ కనకమ్మ, ఆడెపు మౌనిక, చాగంటి ప్రకాశ్, మంద రాజమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, ఆడెపు లాస్యకు సైతం ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలంలో భయానక వాతావరణం నెలకొంది. శ్రీనివాస్ మృతదేహంపై బోల్తా పడిన ట్యాంకర్ నుంచి డీజిల్ పడుతుండడం చూపరుల ఒళ్లు జలదరించేలా చేసింది. ఓ దశలో ట్యాంకర్ పేలుతుందేమో అని ఘటనా స్థలానికి వచ్చిన జనం భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చారు. పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కరీంనగర్ మార్చురీకి, గాయపడ్డ క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్ దవాఖానకు తరలించారు. ట్యాంకర్‌ను పక్కకు తప్పించారు. శ్రీనివాస్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. హార్వెస్టర్ నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకునే శ్రీనివాస్ ఆకస్మికంగా రోడ్డు ప్రమాదంలో కన్నుమూయడంతో భార్యాబిడ్డలు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుడి భార్య పూదరి రేణుక ఫిర్యాదు మేరకు ఆగ్రాకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ దల్వీర్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మానకొండూర్: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మీతోనే నియోజకవర్గ అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే రసమయి జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులు

తిమ్మాపూర్/ మానకొండూర్/ శంకరపట్నం, మే 15: మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి సాధించిందని నాయకులు స్పష్టం చేశారు. బుధవారం నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. తిమ్మాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కేకు కోసి సంబురాలు జరుపుకొన్నారు. పదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు పాశం అశోక్‌రెడ్డి, నాయిని వెంకట్‌రెడ్డి, మెంగని రమేశ్, లక్ష్మణ్, బోయిని తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మానకొండూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయం (గడిమహాల్)లో నిర్వహించిన వేడుకలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హాజరై నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు ఆడప శ్రీనివాస్, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, రామంచ గోపాల్‌రెడ్డి, దండబోయిన శేఖర్, కరుణాకర్‌రెడ్డి, కొత్తకొండ నాగరాజు, నెల్లి శంకర్, గోపు ఈశ్వర్‌రెడ్డి, కనుకుంట్ల అభిలాష్, నామాల శ్రీనివాస్ వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, నాయకులు మోత్కూరి సమ్మయ్య, మొకిరాల కిషన్‌రావు, గోపు విజయ్‌కుమార్‌రెడ్డి, అంతం తిరుపతిరెడ్డి, సాగర్ రావు, హన్మంతు, గుర్రం శ్రీకాంత్, తాళ్లపల్లి శ్రీనివాస్, పోచయ్య, పార్థసారథి, రమేశ్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కోస్తున్న నాయకులు

దర్యాప్తునకు ఆదేశాలు

వేములవాడ, మే 15: ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని వచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు కోసం వేములవాడ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం పార్లమెంట్ ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని మోడీ పాల్గొన్న విషయం తెలిసిందే. అయితే, రాజన్నను దర్శించుకునే సమయంలో బీజేపీ ఎన్నికల గుర్తు కమలం పువ్వు సింబల్‌ను ధరించారని కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఫిర్యాదు చేశారు. ఆలయంలోకి కమలం పువ్వు గుర్తు ధరించి వెళ్లి ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారని ఫిర్యాదు చేయడంతో నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ దర్యాప్తునకు ఆదేశించారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా, రిటర్నింగ్ అధికారి ద్వారా వచ్చిన ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.

జూన్ 20 వరకు 'లండన్ ఎగ్జిబిషన్'

విలేకరులతో మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, మే 15 : జిల్లా కేంద్రంలోని కరీంనగర్ డెయిరీ సమీపంలోని మైదానంలో ఏర్పాటు చేసిన లండన్ ఎగ్జిబిషన్ జూన్ 20వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు మొహమ్మద్ ఇలియాన్, మొహమ్మద్ ఆలీ, మొహమ్మద్ సమీర్ పేర్కొన్నారు. బుధవారం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ప్రదర్శనలో ముఖద్వారంగా లండన్ బ్రిడ్జి, రోబోటిక్ ఎనిమల్స్, లండన్ సిటీ, లండన్ ప్యాలెస్, పెద్ద పడవ తదితర కళాకృతులు ఆకట్టుకునేలా ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే, ఈ ఎగ్జిబిషన్‌లో అతిపెద్ద జాయింట్ విల్, బ్రేక్ డ్యాన్స్, కోలంబస్, డ్రాగన్ ట్రైన్ వంటి 20 రైడ్స్ కొత్త అనుభూతినిస్తాయని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రదర్శనలో ప్లాస్టిక్ నిషేధించినట్లు తెలిపారు. జిల్లా వాసులు ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని సూచించారు.

బీరప్ప ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే

బోయినపల్లి, మే 15: మండలంలోని అనంతపల్లి గ్రామంలో బుధవారం జరిగిన బీరప్ప ఉత్సవాలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీటీసీ కంకణాల వనజ, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.69 of 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS Br.Mahabubnagar. ...Disputant
And
T. Vishal and others ...Opponents
NOTICE
To
2) B. Rama Devi D/o Late Ilaiah, aged 47 years, Occ: Senior Inspector, (Emp. I.d No.1537415), O/o Dist Co-op-Office, at Siricilla Rajanna Dist., R/o H.No.10-1-221, Ramnagar, Near Siddartha School, Karimnagar Town & Dist. Opponents
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Maha bubnagar on 25-05-2024 at 11-30A.M. for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

నమస్తే తెలంగాణ CLASSIFIED
RECRUITMENT
★Pen, Pencil Company, Educated,
Unemployed Girls/Boys, Male/Female,
House Wife Earn 24500-64500 Packing
Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

డిగ్రీలో ప్రవేశాల కోసం 'దోస్త్'

- మే 6 నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు
- ఈనెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు పెట్టుకునే చాన్స్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో సలహా, సహాయక కేంద్రాలు

కమాన్‌చౌరస్తా, మే 15 : డిగ్రీ విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి ఇటీవల దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా, మే 6వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలకు అనుబంధంగా ఉన్న కళాశాలల్లో సలహా, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఇందులో సీట్లను మూడు విడుతల్లో భర్తీ చేయనుండగా, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

సులువుగా రిజిస్ట్రేషన్..

దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు ముందుగానే తమ ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ చేసుకుని పెట్టుకుంటే సరిపోతుంది. టీ- యాప్ ద్వారా https://dost.cgg.gov.in విద్యార్థులు లాగిన్ కాగానే వారికి దోస్త్ ఐడీ, పిన్ నంబరు వస్తుంది. వీటిని ఉపయోగించి దరఖాస్తు పూర్తి చేసుకోవాలి. ఇందులో కోర్సులు, కళాశాలల వారీగా ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. కోరుకున్న కళాశాలలో సీటు వస్తే సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకోవాలి. ఏ దశ కౌన్సెలింగ్‌లో అయినా సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా ఎంపిక చేసుకున్న కళాశాలకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు అందజేసి, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో అవకాశం..

'దోస్త్' లాగిన్‌తో ఆన్‌లైన్ ఫాం నింపే క్రమంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వివరాలను చూసుకోవచ్చు. తమకు నచ్చిన, అందుబాటులో ఉండే యూనివర్సిటీలో దానికి అనుసంధానంగా ఉన్న కళాశాలలో ప్రవేశం సులువుగా పొందవచ్చు.

ముఖ్యమైన తేదీలు

మొదటి దశ రిజిస్ట్రేషన్ : మే 6 నుంచి 25 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు : మే 20 నుంచి
సీట్ల కేటాయింపు : జూన్ 6
రెండో దశ రిజిస్ట్రేషన్ : జూన్ 6 నుంచి 13 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు : జూన్ 6 నుంచి 14వ తేదీ వరకు
సీట్ల కేటాయింపు : జూన్ 18
మూడో దశ రిజిస్ట్రేషన్లు : జూన్ 19 నుంచి జూన్ 25 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు : జూన్ 19 నుంచి 26 వరకు
సీట్ల కేటాయింపు : జూన్ 29

మొబైల్ యాప్ ద్వారా నమోదు

- విద్యార్థి హాల్ టికెట్, పుట్టిన తేదీ, ఆధార్, మొబైల్ నంబర్లు, ఇతర వివరాలు (అభ్యర్థి పేరు, తండ్రి, తల్లి పేరు, లింగం, అభ్యర్థి ఫొటోగ్రాఫ్) నమోదు చేయాలి. అన్నీ సవ్యంగా ఉన్నట్లు ధ్రువీకరణ అయితే దోస్త్ ఐడీ సమాచారం వస్తుంది.
- ఎస్ఎంఎస్, యాప్ ద్వారా దోస్త్ రిఫరెన్స్ ఐడీ, పిన్ సమాచారం అందుతుంది.
- ఆ తర్వాత దోస్త్ ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, వెబ్ ఎంపికలను ఉపయోగించుకుని తదుపరి ప్రక్రియ కోసం వెళ్లవచ్చు.
- రిజిస్ట్రేషన్ రుసుం ₹200 చెల్లించడం ద్వారా దోస్త్‌లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. తదుపరి దోస్త్ ఐడీ పొందుతారు.
- రిజిస్ట్రేషన్ తర్వాత విద్యార్థులకు దోస్త్ ఐడీ, పిన్ వస్తుంది.
- ప్రవేశ ప్రక్రియ ముగిసే వరకు దోస్త్ ఐడీ, పిన్‌ను జాగ్రత్తగా, గోప్యంగా ఉంచాలి.
- దరఖాస్తు ఫారం తెరవడానికి దోస్త్ ఐడీ, పిన్, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి లాగిన్ కావాలి.
- దరఖాస్తు ఫారం నింపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఒక్కసారి వివరాలు ఇచ్చిన తర్వాత దానిని సవరించుకునే అవకాశం ఉండదు. తర్వాత విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీలు/కోర్సులను ప్రాధాన్యతా క్రమంలో ఎంచుకోవడం కోసం వెబ్ ఎంపిక చేసుకోవాలి. కాలేజీ